

సోమశిలలో 55.038 టీఎంసీలు

జలాశయంలో శుక్రవారానికి 55.038 టీఎంసీలు ఉన్నాయి. 25,124 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. కండలేరుకు 9,400, డెల్టాకు 1850, ఉత్తరకాలువకు 340 క్యూసెక్కులు వదులుతున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,380
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,221
3 శాతం జీఎస్టీతో	రూ.9,498
నవర (8 గ్రా)	రూ.75,984

గరిష్టం/కనిష్టం
36.5 /28.2

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా ఉండి, ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఉంటుంది. శుక్రవారం గాలిలో తేమ 53 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

29 మంది ఎంఈఓలకు షోకాజు నోటీసుల జారీ

నెల్లూరు (టౌన్): జిల్లాలో 29 మంది ఎంఈఓలకు జిల్లా విద్యాశాఖాధికారులు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ విషయం విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఎంఈఓలు ప్రతి రోజు ఉదయం 9 గంటల్లోపు ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంది. అయితే గురువారం జిల్లాలో 29 మంది సమయానికి రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోకపోవడం డీఈఓ ఆర్.బాలాజీరావు షోకాజు నోటీసులు జారీ చేశారు. రెండో రోజుల్లో వివరణ పంపాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 38 మంది ఎంఈఓలు ఉన్నారు. వీరిలో 29 మంది సకాలంలో యాప్‌లో హాజరు నమోదు చేసుకోకపోవడం చూస్తే విధుల్లో వారికున్న చిత్తశుద్ధికి అద్దపడుతోంది. పాఠశాలలను పర్యవేక్షించాల్సిన అధికారులే అలసత్వం ప్రదర్శించడంపై పలువురు మండి పడుతున్నారు.

హెల్త్ కేర్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2025–26 సంవత్సరంలో రెండేళ్ల హెల్త్ కేర్ డిప్లొమా కోర్సులు చదివేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరుతోపాటు ఇతర జిల్లాలకు చెందిన వారు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అయితే లోకల్ అభ్యర్థులకు 85 శాతం, నాన్‌లోకల్ అభ్యర్థులకు 15 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 8వ తేదీలోపు కళాశాల పనిదినాల్లో తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. దరఖాస్తు రుసుం రూ.100 ఉంటుందన్నారు. దరఖాస్తులు, ఇతర వివరాలకోసం ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వ్యక్తిగతంగా హాజరుకావాలి

నెల్లూరు (టౌన్): డీఎస్సీ–2025కు సంబంధించి వివిధ కేటగిరీల పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్‌ను అందించనున్నట్లు డీఈఓ బాలాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు జెరాక్స్ కాపీలు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. వెరిఫికేషన్ సంబంధించిన సర్టిఫికెట్ల వివరాలతో కూడిన చెక్ లిస్టును డీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలు, సోషల్ మీడియాలో వచ్చే అసత్య వదంతులు, దుష్ప్రచారాలను నమ్మొద్దన్నారు. వదంతులు సృష్టించి వ్యాప్తి చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు వ్యక్తిగత స్కోర్లు, మెరిట్ లిస్టు, ఎంపిక జాబితాలు, నియామక ఉత్తర్వులు మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్, జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్, క్యాండిడేట్ లాగిన్‌లో విడుదల చేస్తారన్నారు.

అక్రమ గ్రావెల్ రవాణాపై మైనింగ్ ఏడీ తనిఖీ



అక్రమ మైనింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ వాణిశ్రీ, రెవెన్యూ సిబ్బంది

దగదర్తి: మండలంలోని తిరువీధిపాడు గ్రామానికి చెందిన ఓ రైతు తమ పట్టా భూముల్లో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం గ్రావెల్ తరలింపు ప్రదేశాన్ని మైనింగ్ ఏడీ వాణిశ్రీ స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. తిరువీధిపాడులో సర్వే నంబర్ 118లో స్థానిక రైతు మోపూరు భక్తవత్సలరెడ్డి చెందిన పట్టా భూమి ఉంది. తన భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని ఇటీవల స్థానిక పోలీసులకు, తహసీల్దార్, మైనింగ్ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు గ్రావెల్ తరలింపును నిలిపివేయాలన్న ఆదేశాలిచ్చినా అక్రమార్కులు బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారని, అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తూ చేసేదేమీ లేక ఆ రైతు కలెక్టర్‌ను ఆశ్రయించారు. కలెక్టర్ ఆదేశాలతో మైనింగ్ ఏడీ గ్రావెల్ తరలింపు ప్రదేశాన్ని తనిఖీ చేసి ఎవరైనా ఈ భూమిలో గ్రావెల్ తరలిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాటాలో కేటు

తిరకాసు త్రాసు

- నగరంలో వస్తు విక్రయాల్లో నిలువు దోపిడీ
- నిండా మునుగుతున్న వినియోగదారులు
- సాధారణ కాటా, ఎలక్ట్రానిక్ మెషీన్లలోనూ చేతివాటం
- తూచేది కేజీ.. ఉండేది 850 గ్రాములే
- ప్యాకింగ్ సరుకుల్లోనూ అంతే..
- గల్లీ దుకాణం నుంచి సూపర్ మార్ట్‌ల వరకు మోసాలు
- ఫిర్యాదులు వస్తేనే తనిఖీలు





తూకాల్లో మోసానికి కాదేది అనర్హం అన్నట్లుగా నిత్యావసర సరుకుల నుంచి నిత్యం వినియోగించే ఆహార పదార్థాల వరకు, ఆఖరికి బంగారం తూకంలోనూ వ్యాపారులు మోసాలకు తెగబడుతున్నారు. నెల్లూరు నగరంలో కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసినా, మాంసం, చేపలు తీసుకున్నా కాటాల్లో కేటుతనం చూపిస్తున్నారు. ప్యాక్డ్ నూనె, పప్పులు, చింతపండు, ఉప్పు వంటి నిత్యావసర సరుకుల్లోనూ అదే గోల్‌మాల్. సాధారణ త్రాసుల్లోనూ, ఎలక్ట్రానిక్ మెషీన్లలోనూ సెట్టింగ్‌లు చేసి వ్యాపారులు వినియోగదారులను మోసం చేస్తున్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తేనే అధికారులు తనిఖీలకు వెళ్తున్నారు. మొదటిసారి పట్టుబడితే జరిమానా, మళ్లీ పట్టుబడితే కేసులంటూ హెచ్చరిస్తున్నా వ్యాపారుల్లో మార్పు రావడం లేదు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో గల్లీ దుకాణం నుంచి సూపర్ మార్ట్‌ల వరకు సరుకుల తూకాల్లో మోసాలు పెరుగుతున్నా.. పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన తూనికలు కొలతల శాఖాధికారులు నెలవారీ మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా కూరగాయలు, పండ్లు, చికెన్, చేపలు, ప్రొవిజన్ స్టోర్స్, ఇతర సరుకులు, బంగారం.. ఇలా తూకాలతో వ్యాపారాలు చేసే దుకాణాలు సుమారుగా 3.70 లక్షల వరకు ఉన్నట్లు సమాచారం. అయితే తూనికల కొలతల శాఖ గడిచిన ఐదేళ్ల లెక్కలు చూస్తే.. ఏడాదికి 200 మించి తుకాల్లో మోసాలపై కేసులు నమోదు చేయలేదంటే వీరి తీరును అంచనా వేయొచ్చు. వీరు నమోదు చేసిన కేసుల లెక్కలు చూస్తే అంతా ధర్మబద్ధంగా తుకాలు తూసి వినియోగదారులకు ఇస్తున్నట్లే అనుకోవాలా?. నెల్లూరు నగరంలోని ప్రధాన ఏసీ కూరగాయల మార్కెట్లో తక్కరి తూకాలకు పాల్పడుతున్న విషయం జగద్విితమే. ఇక చికెన్, మటన్, చేపల దుకాణాల్లో అయితే అంతకు మించి తుకాల్లో కేటుతనం చూపిస్తున్నారు. ఈ కోవలోనే పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఈ స్థాయిలో తుకాల్లో మోసాలు జరుగుతుంటే.. ఈ శాఖాధికారులు ఠంఛన్‌గా రూ.వేల్లో జీతాలు, వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఈ శాఖాధికారులు ప్రతి దుకాణాన్ని తనిఖీ చేయడంతో పాటు వారి నుంచి స్టాంపింగ్, కాంపౌండ్ ఫీజులు వసూలు చేయాల్సి ఉంది. అయితే వీరికి టార్గెట్లు లేకపోవడంతో కార్యాలయాల్లో కుర్చీలకే పరిమితమై అక్రమ సంపాదనలో మునిగి తేలుతున్నారు. ఐదేళ్ల క్రితం స్టాంపింగ్, కాంపౌండ్ ఫీజులు ఎంత వసూలు చేశారో.. ఐదేళ్ల తర్వాత కూడా అంతే మొత్తంలో వసూలు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ ఐదేళ్లలో వ్యాపార దుకాణాలు విస్తరణ జరగలేదా? లేక.. విధులు వదిలేసి లంచాలతో విలాసాలు చేస్తున్నారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సం ॥	స్టాంపింగ్ ఫీజు (రూ.ల్లో)	కాంపౌండ్ ఫీజు (రూ.ల్లో)	డబ్ల్యూఅండ్ఎం	ప్యాకింగ్ కమోడిటీ	మొత్తం
2019–20	75,73,840	26,01,100	114	75	189
2020–21	83,63,610	26,78,500	108	46	154
2021–22	92,90,566	24,25,000	195	56	251
2022–23	80,39,852	21,72,000	201	48	249
2023–24	95,85,701	26,92,500	123	84	207

'ఆప్షన్స్'తో గోల్‌మాల్

ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషీన్‌లో మొత్తం నాలుగు ఆప్షన్లు ఉంటాయి. కిలోకు 100–150 గ్రాముల తక్కువగా ఉండేలా సెట్ చేస్తున్నారు. ఎవరైనా కేజీ సరుకు అడిగితే.. తూకం మెషీన్‌లో కేజీకి మించి మొగ్గుగా చూపిస్తారు. ధర్మకాటాలో తూస్తే 850–900 గ్రాములే బరువు ఉంటుంది. అదే మెషీన్‌పై కిలో నికర బరువు ఉంచితే 1100–1150 గ్రాములు చూపుతోంది. అంటే ఏ రకంగా వ్యాపారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారో అర్థమవుతోంది.

ప్యాకింగ్‌లో సైతం

మార్కెట్‌లో లభించే వివిధ బ్రాండ్ల నూనె ప్యాకెట్లు కూడా నిర్దేశించిన బరువు కంటే తక్కువగా ఉంటున్నాయి. లీటర్ ప్యాకేజ్ నిబంధన ప్రకారం 910 మి.లీ. ఉండాలి. కానీ 800–850 మి.లీ. మించడం లేదు. ఇక ఐదు లీటర్ల ప్యాకేజ్ బాటిల్‌లో 200–280 గ్రా. 15 లీటర్ల ప్యాకేజ్ డబ్బాలో 250–300 మి.లీ.తక్కువగా ఉంటుంది.

పసిడి తూకంలోనూ మోసం

నగరంలోని పెద్ద పెద్ద దుకాణాల్లో మినహా మిగతా సాధారణంగా 24 క్యారెట్ల కంటే తక్కువ నాణ్యత కలిగిన బంగారాన్నే విక్రయిస్తుంటారు. వజ్రాల నగ కేవలం 18 క్యారెట్ల బంగారంతో మాత్రమే ఉంటుంది. వ్యాపారులు 18 క్యారెట్ల ఆభరణాన్ని వినియోగదారులకు 22 క్యారెట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు. 22 క్యారెట్లు, 18 క్యారెట్ల ఆభరణానికి మధ్య గ్రాముకు కనీసం రూ.500 నుంచి రూ.700 వరకు తేడా ఉంటుంది. ఈ లెక్కన కనీసం 10 గ్రాములకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు మోసం చేస్తున్నారు. బంగారం తూచే ఎలక్ట్రానిక్ కాటాల వెను త్రాసును నియంత్రించే వీల్స్ బేరింగ్‌లను మార్పు చేసే అవకాశం ఉంటుంది. బంగారం నాణ్యతను తెలిపే మెషిన్ లేకపోవడంతో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు.

ఆర్టీసీ పార్శిల్ విభాగంలో..

ఆర్టీసీ ఆన్‌లైన్ పార్శిల్ విభాగంలో కూడా మోసాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. స్థానికంగా పార్శిల్ పంపుకోవాలంటే కేజీల వంతున వసూలు చేసే వారు. దీంతో అక్కడ వెయింగ్ మెషిన్‌లో భారీగా తేడాలు ఉంచి మోసం చేస్తున్నట్లుగా ఫిర్యాదులు రావడంతో అధికారులు దాడులు చేస్తే విస్తుపోవాల్సి వచ్చింది. 50 కేజీల బరువు ఉన్న లగేజీ 60 కిలోలు చూపించింది. ఇలా తూకం ఎక్కువగా చూపించి మోసం చేయడం వెలుగులోకి వచ్చింది.

కేసులే కానీ.. శిక్షల్లేవ్..

తూకాల్లో మోసం, నిబంధనల ఉల్లంఘనలపై మొదటి సారి జరిమానా విధిస్తారు. అదే తప్పు తిరిగి చేస్తే కేసు నమోదు చేసి కోర్టుకు సిఫార్సు చేస్తారు. కోర్టు జరిమానాతోపాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అయితే కొన్నేళ్లలో తూనికలు కొలతల శాఖ అధికారులు నమోదు చేసిన కేసుల్లో ఒక్కరికి కూడా శిక్ష పడిన దాఖలాలు లేవంటే వీరు నమోదు చేసే కేసులు కోర్టు వరకు వెళ్లకుండానే అమ్యామ్యాలతో మాఫీ చేస్తున్నారని అర్థమవుతోంది. ఒక వేళ ఒకటీ.. అరా కోర్టు వరకు వెళ్లి కేసుల్లోనూ మోసగాళ్లకు శిక్ష పడకుండా కేసును నీరుగార్చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. తక్కువ తూకం వేస్తే తూనికలు, కొలతల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2009 యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం కనీసం రూ.1000 నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారు. ప్యాకేజీ కమోడిటీ యాక్ట్ 30 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారికి రూ.2 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా వేస్తారు.

లక్షల్లో దుకాణాలు.. రెండొందలు దాటని కేసులు

జిల్లాలోపెద్ద, చిన్న చితకా వ్యాపార సంస్థలన్ని కలిపి దాదాపు 3.70 లక్షల దుకాణాలు ఉంటే.. ఒక్క నెల్లూరు నగరంలోనే సుమారు 1.50 లక్షలకు పైగా ఉంటాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి మోసాలను అరికట్టాల్సిన బాధ్యత తూనికలు, కొలతల శాఖ అధికారులపై ఉంది. అయితే వీరు సుమోటోగా తనిఖీలు చేసి కేసులు నమోదు చేయాల్సి ఉండగా, తమ విధులకు స్వస్తి చెప్పి.. కార్యాలయాల్లో కూర్చొని అవినీతి మత్తులో తూగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొనుగోలుదారులు ఫిర్యాదులు చేస్తే తనిఖీలు చేస్తున్నారనే దానికి గడిచిన ఐదేళ్లలో వీరు నమోదు చేసిన కేసులే ఉదాహరణగా నిలుస్తున్నాయి.

కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించినా నేరమే

సాక్షి, టాస్క్‌ఫోర్స్: బిట్రగుంట పోలీసులు భారతీయ న్యాయసంహితకు కొత్త భాష్యం చెబుతున్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనల్లో భాగంగా శాంతియుతంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించినా నేరమేనంటూ వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా అదుపులోకి తీసుకోవడం శుక్రవారం కలకలం రేపింది. జలదంకి మండలం అన్నవరం క్వారీలో డ్రోన్ ఘటన తర్వాత అధికార పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేసినా, రోడ్డెక్కి రచ్చ చేసినా కన్నెత్తి చూడని ఖాకీలు, శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినందుకు వైఎస్సార్‌సీపీ నాయకులను అదుపులోకి తీసుకోవడం, స్పష్టమైన కారణాలు చెప్పకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘుతోపాటు పలువురు కార్యకర్తలను శుక్రవారం ఉదయమే అదుపులోకి తీసుకున్న పోలీసులు రాత్రి ఏడు గంటల వరకూ విడిచి పెట్టలేదు, అదుపులోకి తీసుకోవడానికి సరైన కారణాలు చూపించలేదు. వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను భంగ పరిచేలా ఉదయం నుంచి రాత్రి వరకు అక్రమంగా అదుపులో ఉంచుకోవడంతో కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పోలీసుల నోటీసులు

దగదర్తి: మండలంలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని ఎటువంటి ర్యాలీలు ధర్నాలు చేపట్టకూడదంటూ మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలకు ముందస్తుగా శుక్రవారం పోలీసులు నోటీసులు అందజేశారు. ఆ పార్టీ మండల కన్వీనర్ వెలిసేని మహేష్‌నాయుడు, మండల ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు, తాళ్లూరి రాజశేఖర్ నాయుడు, తడకలూరు పంచాయతీ సర్పంచ్ ఆత్మకూరు గిరినాయుడుకు పోలీసులు నోటీసులు అందజేశారు. ఇటీవల కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సోషల్ మీడియా వ్యక్తులపై అక్రమ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్రమ కేసులకు నిరసనగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు శాంతియుత ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దగదర్తి మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులను అదుపులోకి తీసుకోవడంపై పోలీసులను సంప్రదించగా అనుమతులు లేకుండా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించడంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



వైఎస్సార్‌సీపీ నేతలకు పోలీసులు అందించిన నోటీసు

నిరసనలు ర్యాలీలు నిర్వహించకుండా ముందస్తుగా పోలీసులు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు అందజేశారు.

అరుణ కేసులో మరో ముగ్గురి అరెస్ట్

కోవూరు: రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న జీవిత ఖైదీ శ్రీకాంత్‌కు పెరోల్ వ్యవహారం నడిపించడంలో కీలకపాత్ర పోషించిన అతని స్నేహితురాలు నిడిగుంట అరుణ కేసులో శుక్రవారం మరో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీకాంత్ పెరోల్ వ్యవహారాన్ని పక్కదోవ పట్టించేందుకు కొన్నేళ్ల క్రితం జరిగిన విషయానికి సంబంధించి తాజాగా తిరగతోడి ఆమెతోపాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఈ కేసులో అప్సర్, ముసబీర్, గణేష్ పరారీలో ఉండగా శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించారు. శ్రీకాంత్‌కు పెరోల్ వ్యవహారంలో అరుణ కీలకపాత్ర పోషించినట్లు బయటకు రావడంతో ప్రభుత్వ పెద్దల బండారాలను బయటపెడతానని సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంతో ఉలికి పడిన ప్రభుత్వం ఆమెతోపాటు ఆమె గ్యాంగ్‌పై ఎక్కడెక్కడ కేసులు ఉన్నాయో బయటకు తీస్తున్నారు. అరుణ గ్యాంగ్ అక్రమ కార్యకలాపాలు, భూ కబ్జాలు, దౌర్జన్యాలు, భయపెట్టి డబ్బులు వసూలు చేయడం వంటి ఆరోపణలపై జిల్లా వ్యాప్తంగా కేసులు నమోదయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో అల్లకల్లోలం సృష్టిస్తున్న ఈ గ్యాంగ్‌పై స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. అధికారుల సమాచారం ప్రకారం అరెస్టయిన వారు గ్యాంగ్‌లో కీలకంగా పనిచేస్తూ, భూ వివాదాలు, వసూళ్లలో నేరుగా పాలు పంచుకున్నట్లు తేలింది. పోలీసులు మిగిలిన సభ్యులపై కూడా గాలింపు కొనసాగిస్తున్నారు.

పోలీసుల అదుపులో పలువురు రౌడీషీటర్లు

నెల్లూరు (క్రైమ్): శ్రీకాంత్ అతని స్నేహితురాలి వ్యవహారంలో జిల్లా పోలీసు అధికారులు విభిన్న కోణాల్లో విచారణ చేపట్టారు. వారితో సన్నిహితంగా మెలిగిన, మెలుగుతున్న రౌడీషీటర్లు, పాత నేరస్తుల వివరాలను సేకరించారు. శుక్రవారం వేదాయపాళెం పోలీసుస్టేషన్ పరిధిలోని పలువురు రౌడీషీటర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే అరుణ తనను మోసగించిందని విజయవాడకు చెందిన ఓ వ్యక్తి శుక్రవారం పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు నెల్లూరుకు వచ్చినట్లు తెలిసింది. పోలీసు అధికారులు తొలుత కోవూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సదరు వ్యక్తికి చెప్పడంతో ఆయన కోవూరుకు వెళ్లినట్లు తెలిసింది. అనంతరం ఉన్నతాధికారులే సదరు వ్యక్తిని విచారిస్తున్నట్లు సమాచారం. నెల్లూరు నగరంలోని యాక్టివ్ రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

కార్మికుల ఆరోగ్య హక్కులపై రాజీలేని పోరాటం

- ఈఎస్‌ఐ డిస్పెన్సరీల ఏర్పాటులో రాష్ట్రం నిర్లక్ష్యం
- తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం: నెల్లూరు జిల్లాలో కార్మికులు, ఉద్యోగులకు మెరుగైన వైద్యసౌకర్యాలు అందించేందుకు కొత్త ఈఎస్‌ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలు ఏర్పాటు వేగవంతం చేయాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఈఎస్‌ఐ డైరెక్టర్ జనరల్‌కు ఆయన లేఖ రాశారు. ఆ లేఖకు సంబంధించి ఈఎస్‌ఐ డైరెక్టర్ జనరల్ శుక్రవారం సమాధానమిచ్చారని తెలిపారు. నెల్లూరులో కూడా ఈఎస్‌ఐ సొంత భూమిలో 100 పడకల ఆస్పత్రి నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యా యని, కాంట్రాక్టు ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలోనే పనులు చేపడుతామన్నారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో అధిక సంఖ్యలో ఉన్న కార్మికులు, ఉద్యోగులకు తగిన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ఈఎస్‌ఐ హాస్పిటల్స్ ఏర్పా టు చాలా ముఖ్యమన్నారు. గతంలో ఇదే అంశంపై పార్లమెంటులో పలుమార్లు ప్రస్తావించిన అంశాన్ని గుర్తుచేశారు. త్వరలోనే ఈఎస్‌ఐ ఆస్పత్రుల నిర్మాణం ప్రారంభమయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈఎస్‌ఐ డిస్పెన్సరీలు కూడా తక్షణమే ప్రారంభమయ్యేలా ఒత్తి డి తెస్తామన్నారు. ఈఎస్‌ఐ డిస్పెన్సరీల ఏర్పాటుకు భూములు కేటాయించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

అశ్వవాహనంపై ఊరేగిన వెంకయ్యస్వామి



అశ్వవాహన సేవలో వెంకయ్యస్వామి

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో కొలువైన భగవాన్ వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం అశ్వవాహన సేవ నిర్వహించారు. ఉదయం వెంకయ్యస్వామి ఆలయంలో నిత్య పూజలనంతరం స్వామి వారిని అశ్వవాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూలాలంకరణ చేశారు. భక్తులు భుజాలపై స్వామి వారిని ఆలయం చుట్టూ తిప్పారు. ఆ తర్వాత ట్రాక్టర్‌పై స్వామి వారిని ఆశీనులను చేసి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు హారతినిచ్చి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈ గ్రామోత్సవం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సాగింది. ఉత్సవం ముందు మహిళల కోలాట ప్రదర్శనలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు భారీగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అశ్వవాహనసేవకు నెల్లూరుకు చెందిన గుడె శ్రీధర్, అరుణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కనుల పండవగా పెదశేష వాహన సేవ

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పెద శేష వాహనసేవ నిర్వహించారు. స్వామివారిని పెద శేషవాహనంపై ఆశీనులను చేసి విద్యుద్దీపాలంకరణ చేశారు. పెదశేష వాహనసేవ గొలగమూడి వీధుల్లో వేడుకగా సాగింది. ఉత్సవం వెంట భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఉత్సవాల్లో నేడు

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సింహ వాహనసేవ, రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

మీటర్ పెట్టినా షాకే

- సామాన్యులపై కూటమి ప్రభుత్వం మరో భారం
- ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లతో ఇప్పటికే దోపిడీ
- తాజాగా కొత్త మీటర్లకు వంద శాతం పైగా పెంపు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే చార్జీలు తగ్గిస్తామని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకరిస్తున్నామని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగుల కొట్టండని గతంలో చంద్రబాబు, లోకేశ్‌లు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. అయితే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక సర్ చార్జీలు, టూఅప్ చార్జీలు (ఇంధన సర్దుబాటు చార్జీలు) పేరుతో మూడేళ్ల క్రితం వాడుకుని చెల్లించిన విద్యుత్ బిల్లులకు తాజాగా విద్యుత్ చార్జీలు అమాంతం పెంచి రూ. వేల కోట్లు భారం వేసి ప్రజల నడ్డి విరుస్తోంది. వాడుకున్న విద్యుత్ కంటే ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీల పేరుతో వచ్చే బిల్లులే ఎక్కువ కావడంతో ప్రజలు షాక్‌కు గురవుతున్నారు. గతంలో చెప్పిన మాట తప్పిన కూటమి ప్రభుత్వం స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును వేగవంతం చేస్తోంది. ఈ మీటర్లు పెట్టుకుంటే రోజులో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక టారిఫ్, మధ్యాహ్నం నుంచి ఒక టారిఫ్, సాయంత్రం నుంచి మరో టారిఫ్‌లతో బిల్లుల మోత మోగుతున్నాయి. ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసుకున్న వారు కరెంట్ కావాలంటే ముందుగానే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది.



కొత్త మీటర్లకు చార్జీలు భారీగా పెంపు

ఈ షాక్‌లు ప్రజలకు సరిపోవన్నట్లుగా ప్రభుత్వం ప్రజలపై మరో పెద్ద షాక్ వేసింది. కొత్తగా విద్యుత్ సర్వీసు కనెక్షన్ కావాలనుకునే ప్రజలకు ఇది నిజంగా పెద్ద షాకే అని చెప్పాలి. నూతనంగా విద్యుత్ సర్వీసు కావాలనుకుంటే గృహ వినియోగదారులు కేటగిరీ–1లో ఒక కిలో వాట్ విద్యుత్ కనెక్షన్‌కు గతంలో రూ.1,850 ఉంటే ఇప్పుడు రూ.4150లకు పెంచారు. రెండు కిలో వాట్‌కు అయితే రూ.3,750 నుంచి రూ.7,800 వరకు పెంచేసింది. వ్యాపార, వాణిజ్య వినియోగదారులు కేటగిరీ–2లో ఒక కిలో వాట్‌కు రూ.2,250 ఉంటే.. ఇప్పుడు రూ.5,300 వరకు పెంచటం జరిగింది. అదే రెండు కిలో వాట్‌కు రూ.4,500 నుంచి రూ.9,800 వరకు పెంచారు. గతంలో నూతన విద్యుత్ సర్వీసు కనెక్షన్ కోసం ప్రజలు విద్యుత్ సంస్థకు చెల్లించే రుసుం కంటే ప్రస్తుతం వంద రెట్లకు పైగా వసూలు చేస్తుండడంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఈ పరిణామాలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెనుభారంగా మారింది.

‘కూటమి’ నిర్లక్ష్యం

- నిలిచిన రిటైనింగ్ వాల్ పనులు
- పైసా ఇవ్వని ప్రభుత్వం
- పేరుకుపోతున్న చెత్తాచెదారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పనులకు నిధులు ఇవ్వడం లేదు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని ప్రజాప్రతినిధులు మైకు ముందు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన పనులు పూర్తి చేసేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

నాడు ఇలా..

పెన్నానది నుంచి నెల్లూరు సిటీ గుండా 20 కిలోమీటర్ల మేర సర్వేపల్లి కాలువ ఉంది. దీని ద్వారా 47 వేల ఎకరాల్లో పంటలకు సాగునీరు అందుతుంది. ఎక్కువగా నీరు, వరదలు వచ్చినప్పుడు కాలువ పొంగడం, గట్టుపై ఉన్న ఇళ్లకు ప్రమాదాలను నివారించేందుకు 2021 సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.99 కోట్ల అంచనాలతో రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను చేపట్టింది. 0.6 కిలోమీటర్ శెట్టిగుంటరోడ్డు నుంచి 0.30 కి.మీ ముత్తుకూరు రోడ్డు బ్రిడ్జి వరకు కాలువకు రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టారు. ఇంత వరకు రూ.54.19 కోట్లు బిల్లులు చెల్లించగా 56 శాతం మేర పనులు పూర్తయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇంకా 1.5 కి.మీ పని మిగిలి ఉంది.

నిధులివ్వకుండా..

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ కాలువ నిర్మాణానికి నయాపైసా విదల్చలేదు. దీంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. పనులు పూర్తి కాకుండానే పంట కాలువకు నీరు వదలడంతో సిటీ పరిధిలో కాలువలో కొన్నిచోట్ల గండ్లు పడి ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది. పంటలకు నీరు వదిలినా మధ్యలో ఉన్న ఖాళీల్లో చెత్తాచెదారం విపరీతంగా చేరిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కాలువపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. పనులు, ఆక్రమణలపై ఏఈ డి.మహేశ్వర్ స్పందిస్తూ కొత్తగా బాధ్యతలు చేపట్టానని, ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



హరనాథపురం సెంటర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాలు



గతంలో నిర్మించిన వాల్

గణేష్ ఉత్సవాలకు సింగిల్ విండో అనుమతులు

నెల్లూరు(క్రైమ్): గణేష్ ఉత్సవాలకు సంబంధించి అన్ని రకాల అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. నిర్వాహకులు https://ganeshutsav.net వెబ్‌సైట్ ద్వారా అనుమతి పొందవచ్చు.

దరఖాస్తు విధానం ఇలా..

కమిటీ సభ్యుల వివరాలు, విగ్రహ ఏర్పాటు ప్రదేశం, ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది?, విగ్రహంతోపాటు మండపం ఎత్తు, ఏ రోజు పెడతారు?, నిమజ్జనం ఎక్కడ?, ఏ సమయంలో చేస్తారు?, ఏ వాహనంలో తరలిస్తారు? తదితర వివరాలను వెబ్‌సైట్‌లో నమోదుచేసి దరఖాస్తు చేసుకోవాలి. అది సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు వెళ్తుంది. ఆయన ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు మండపం ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని సందర్శిస్తారు. ఏర్పాట్లను పరిశీలించి సానుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీ జారీ చేస్తారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తుదారుడి ఫోన్ నంబర్ ఎంటర్ చేసి ఎన్‌ఓసీ ప్రతిని పొందవచ్చు. క్యూఆర్ కోడ్‌ను ల్యామినేషన్ చేసి ఉత్సవాలను నిర్వహించే పందిరిలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలి.

పోలీసుల సూచనలు

విగ్రహాలను రహదారులకు దూరంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. తాత్కాలిక సీసీ కెమెరాలను పెట్టాలి. రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి కార్యక్రమాలు జరపరాదు. వలంటీర్లను నియమించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి. మండపాల వద్ద వాహనాలను పార్కింగ్ చేయరాదు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదు. విధిగా ఇసుక బస్తాలు, డ్రమ్ముల్లో నీరు, అగ్నిప్రమాద నిరోధక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. బాణసంచా కాల్చరాదు. రాత్రివేళల్లో వలంటీర్లు మండపంలో నిద్రించాలి. డీజేలు, లౌడ్ స్పీకర్లు, అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవు. విగ్రహ నిమజ్జన సమయంలో ఇతరులను రెచ్చగొట్టే విధంగా వ్యవరించరాదు. అలాగే మద్యం సేవించి వాహనం నడపకూడదు. వాహనాల వివరాలు, డ్రైవర్ లైసెన్స్ వివరాలు ముందుగానే పోలీసు అధికారులకు ఇవ్వాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలి. ఏదైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.

ఎన్‌ఐఓటీతో ఒప్పందం విద్యార్థులకు వరం

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ సంస్థ (ఎన్‌ఐఓటీ) మధ్య కుదిరిన ఒప్పందం విద్యార్థులకు వరమని వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని వీఎస్‌యూలో వీసీ ఇతర అధికారులతో కలిసి ఒప్పందానికి సంబంధించిన పత్రాలను శుక్రవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీఎస్‌యూ, ఎన్‌ఐఓటీ మధ్య ఈనెల 20వ తేదీన ఒప్పందం కుదిరిందని చెప్పారు. మనిషి సముద్రంపై అవగాహన పెంచుకోవడంలో విఫలం చెందాడన్నారు. ఎన్నో ఖనిజాలకు నెలవైన సముద్రాన్ని అన్వేషించడం దేశ ఆర్థిక ప్రగతి మరింత పెరిగే అవకాశాలున్నాయని తెలియజేశారు. గుజరాత్ రాష్ట్రం అత్యధిక తీర ప్రాంతంతో మొదటి స్థానంలో ఉంటే, మన రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. పరిశోధనలు ముమ్మరం చేయాలని ప్రధాని నరేంద్రమోదీ రూ.4,500 కోట్లతో సముద్రయాన్ పథకాన్ని రూపొందించారని, ఇది మెరైన్ బయాలజీ విభాగం విద్యార్థులకు ఎంతో ప్రయోజనంగా మారుతుందన్నారు. ఒప్పందం కింద మెరైన్ బయాలజీ విభాగానికి రూ.4.12 కోట్ల నిధులు మంజూరు చేశారని వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, మెరైన్ బయాలజీ విభాగం హెడ్ డాక్టర్ హనుమారెడ్డి, సీహెచ్ వెంకట్రాయులు తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందపత్రాలను ప్రదర్శిస్తున్న వీసీ తదితరులు

సైబర్ నేరగాళ్ల అరెస్ట్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మంత్రి నారాయణ అల్లుడు కంపెనీలో పనిచేస్తున్న అకౌంటెంట్‌కు యజమాని పేరుతో మెసేజ్ పెట్టి రూ.1.96 కోట్లు దోచుకున్న సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. గత నెలలో కంపెనీ అకౌంటెంట్‌కు నారాయణ అల్లుడి పేరుతో వాట్సప్ మెసేజ్ వచ్చింది. ఒక బ్యాంక్ ఖాతా నంబర్ పంపి దానికి వెంటనే రూ.1.96 కోట్లు నగదు వేయాలని అందులో ఉంది. అకౌంటెంట్ నగదు పంపాడు. ఈ విషయాన్ని మరుసటి రోజు నారాయణ అల్లుడికి అతను చెప్పగా తాను మెసేజ్ పంపలేదని చెప్పాడు. దీంతో సైబర్ నేరం జరిగిందని గ్రహించిన అకౌంటెంట్ నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు విచారణ చేపట్టి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రదీప్ అనే వ్యక్తిని కొద్దిరోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన సూత్రధారి అరవింద్‌కుమార్ శ్రీవాస్తవ్‌ను ఉత్తరప్రదేశ్ పోలీసులు శుక్రవారం పట్టుకుని రూ.1.40 కోట్ల నగదును ఫ్రీజ్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉండగా ముమ్మరంగా గాలిస్తున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు



స్టేడియంలో చేసిన ఏర్పాట్లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర ఫుట్‌బాల్ క్రీడా సంఘం ఆదేశాల ప్రకారం రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను శనివారం నుంచి రెండురోజులపాటు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. శనివారం ఉదయం ప్రారంభోత్సవం, ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా క్రీడాకారులతోపాటు అధికారులు, అంపైర్లు హాజరవుతారని తెలిపారు.

కావలిలో చెన్నై వాసి మృతి



కమలనాథన్ మృతదేహం

కావలి(జలదంకి): చెన్నైకు చెందిన కమలనాథన్ అనే వ్యక్తి కావలి మండలం మద్దూరుపాడులో చనిపోయాడు. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. కమలనాథన్‌కు మతిస్థిమితం లేదు. కొంత కాలంగా మద్దూరుపాడు సమీపంలో ఉంటున్నాడు. ఎవరైనా ఆహారం అందిస్తే తింటూ జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఎన్‌హెచ్ – 16 పక్కన సర్వీసు రోడ్డులో పెట్రోల్ బంకు ముందు చనిపోయి ఉన్నాడు. మృతుడికి సుమారు 40 సంవత్సరాల వయసు ఉంటుందని భావిస్తున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లోంచి పడి..

- గుర్తుతెలియని వ్యక్తి మృత్యువాత

కొడవలూరు: రైల్లోంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కొడవలూరు – పడుగుపాడు రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై కె.వెంకటేశ్వరరావు కథనం మేరకు.. ఓ వ్యక్తి హౌరా నుంచి బెంగళూరు వెళ్తున్న రైల్లో నుంచి 184 – 3 – 5 పోస్టుల మధ్య ఎగువ లైన్ వద్ద ప్రమాదవశాత్తు జారి పడి చనిపోయాడని భావిస్తున్నారు. అతని వయసు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని చెబుతున్నారు. ఎరుపు రంగు టీషర్టు, నలుపు, తెలుపు రంగుల డిజైన్ కలిగిన షార్ట్ ధరించి ఉన్నాడు.

హామీలెప్పుడు నెరవేరుస్తారు?

- కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ నిరసన

నెల్లూరు రూరల్: ‘కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం దాటిపోయింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారు’ అని ఎస్ఎఫ్ఐ నేతలు ప్రశ్నించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు శుక్రవారం నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.6,400 కోట్లను విడుదల చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లును పెంచాలన్నారు. అర్హులైన వారికి తల్లికి వందనం రూ.15 వేలు ఎటువంటి షరతులు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఆర్ డిగ్రీ కళాశాలను పునఃప్రారంభించాలని, ఎయిడెడ్ కొనసాగించాలన్నారు. యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే జీఓలను రద్దు చేయాలన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో యూనెక్స్ సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ అండర్ – 15 పోటీలను శుక్రవారం ప్రారంభించారు. నారాయణ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎండీ వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చౌదరి జ్యూవెలర్స్ ఎండీ రాజేష్ చౌదరి, 27వ డివిజన్ కార్పొరేటర్ మురహరి అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ పి.అంకమ్మ చౌదరి మాట్లాడుతూ 238 మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారని తెలిపారు. ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయికి ఎంపికవుతారన్నారు. కార్యక్రమంలో అసోసియేన్ జాయింట్ సెక్రటరీ మద్దిపాటి ప్రసాద్‌రావు, ట్రెజరర్ గాదంశెట్టి శ్రీకాంత్, కోచ్‌లు, అంపైర్లు పాల్గొన్నారు.



పోటీలకు విచ్చేసిన క్రీడాకారులు

ఊరెళ్లారు.. ఇల్లు దోచేశారు

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు తలుపులు పగలగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. పోలీసుల కథనం మేరకు.. లేక్‌వ్యూ కాలనీ మూడో వీధిలో వెంకటేశ్వర్లు కుటుంబం నివాసం ఉంటోంది. అతను వెదురు బొంగుల వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల భార్య హైదరాబాద్‌లోని కుమార్తె వద్దకు వెళ్లింది. వెంకటేశ్వర్లు గురువారం వ్యాపార నిమిత్తం ఆత్మకూరుకు వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను తెరచి అందులో ఉన్న సుమారు ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలు, డైమండ్ నెక్లెస్, కొంత నగదు, వెండి వస్తువులను దోచుకెళ్లారు. ఇంటికొచ్చిన వెంకటేశ్వర్లు చోరీ ఘటనపై దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయోగశాలకు గుర్తింపు

నెల్లూరు(పొగతోట): నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న ఎరువులు, సేంద్రియ ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. రైతులకు ఎరువుల నాణ్యత, నేల సారవంతంపై మెరుగైన సలహాలు, సూచనలు అందించినందుకు నేషనల్ బోర్డు ఫర్ అక్రిడిటేషన్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ గుర్తింపు దక్కింది. రాష్ట్రంలోనే మొదటిసారిగా నెల్లూరు అగ్రికల్చర్ ల్యాబ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఆనంద్ అభినందించారు.



ల్యాబ్ వద్ద అధికారులు

శ్రావణ శోభ

అమ్మవారి ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. ఆఖరి శుక్రవారం సందర్భంగా నెల్లూరులోని నగరంలో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

– నెల్లూరు (బృందావనం)/సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ప్రత్యేకాలంకరణలో..



రంగనాయకులపేటలో పూజల్లో పాల్గొన్న మహిళలు



మూలస్థానేశ్వరాలయంలో..



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో..

క్యాషియర్‌పై దాడి చేసి చోరీ

- నిందితుల్లో ఒకరిని వెంటాడి పట్టుకున్న హోంగార్డులు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి రోడ్డు వద్దనున్న మద్యం షాపులో క్యాషియర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన నజీర్‌బాషా షాపులో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు షాపు మూత వేసే సమయంలో అక్కడికి వచ్చి నజీర్ బాషాపై ఇనుపరాడ్డుతో దాడి చేసి, క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.20 వేల నగదుతో పరారయ్యారు. ఇద్దరిలో ఒకరిని కృష్ణపట్నం పోర్టు వద్ద హోంగార్డులు అదుపులోకి తీసుకున్నారు. బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తుండటంతో హోంగార్డులు వెంబడించారు. ఒకరు పరారవగా మరో వ్యక్తిని పట్టుకున్నారు. అతను నెల్లూరు నగరానికి చెందిన యాసిన్‌గా తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు

- పరస్పర దాడులు

కొండాపురం: మండలంలోని గరిమెనపెంట పంచాయతీ వెంకటరంగాపురంలో ఇద్దరు అన్నదమ్ములు ఆస్తి కోసం శుక్రవారం మధ్యాహ్నం పరస్పర దాడులు చేసుకున్నారు. డేగా రాము, మల్లికార్జున, మహేష్‌లు అన్నదమ్ములు. వీరి మధ్య ఆస్తి తగాదాలున్నాయి. ఈ క్రమంలో రాము, అతని కుమారుడు మణిపై మహేష్, మల్లికార్జున, సమీప బంధువైన పసుపులేటి రాహుల్ దాడి చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారికి రక్త గాయాలయ్యాయి. కొండాపురం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు వెళ్లారు.

మోటార్‌బైక్‌పై వెళ్తూ..

- కాలువలో పడి వ్యక్తి మృతి

దగదర్తి: మండలంలోని వెలుపోడు గ్రామానికి చెందిన కొల్లి సురేష్ (36) అనే వ్యక్తి కాలువలో పడి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సురేష్ శుక్రవారం దగదర్తి నుంచి వెలుపోడుకు మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. దగదర్తి సమీపంలో ఉన్న ముంగమూరు కాలువ బ్రిడ్జి వద్ద రోడ్డు పక్కనే ఉన్న రాయిని బైక్ ఢీకొట్టడంతో కాలువలో పడిపోయాడు. వెంటనే స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న బంధువులు తీవ్రంగా గాయపడిన సురేష్‌ను కావలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడని సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించినట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.20



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.103
లేయర్	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.192
స్కిన్‌లెస్ చికెన్	: రూ.212
లేయర్ చికెన్	: రూ.200

నకిలీ మావోయిస్టు అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): రూ.2 కోట్లు నగదు ఇవ్వకపోతే చంపేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని బెదిరించిన నకిలీ మావోయిస్టును నెల్లూరు దర్గామిట్ట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. అల్లూరు తూర్పు వీధిలో నాగమణికుమార్ నివాసముంటున్నాడు. అతను ఆరునెలలుగా హరనాథపురంలోని బావమరిదికి చెందిన పిండిమిల్లులో పనిచేస్తున్నాడు. కుమార్ సులభ పద్ధతిలో నగదు సంపాదించేందుకు సోషల్ మీడియాలో సెర్చ్ చేశాడు. నక్సల్స్ పేరిట బెదిరింపు లేఖల అంశానికి సంబంధించిన వీడియోలను పరిశీలించాడు. ప్రశాంతిరెడ్డిని బెదిరించి నగదు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తాను మావోయిస్టు దళ కమాండర్‌నని, రూ.2 కోట్లు ఇవ్వాలని లేకపోతే చంపేస్తానని బెదిరిస్తూ ఆమెకు లేఖ రాశాడు. ఈనెల 18వ తేదీన ఎమ్మెల్యే ఇంటికొచ్చి విధుల్లో ఉన్న భద్రతా సిబ్బందికి లేఖ ఇచ్చి వెళ్లాడు. సిబ్బంది దానిని ఎమ్మెల్యే కార్యాలయానికి అందజేశారు. వారు అందులో ఉన్న విషయాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుడిని గుర్తించారు. శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ మెడికల్ కళాశాల పార్కింగ్ ప్రదేశంలో అరెస్ట్ చేశారు.